# ఆధుని'కులం'

...ఇతర కథలు

బొందలపాటి



© Author

First Edition July 2012

Published as eBook on http://kinige.com

సాహిత్యం జీవితాన్ని సాధ్యమైనంత దగ్గరగా ప్రతిబింబించాలని నా నమ్మకం. కొన్నాళ్ళకిందట ఆ నమ్మకం తో రాసిన కథల సమాహారం ఇది. ‘‘ఇప్పటి తెలుగు సినిమాలూ కథలూ సమకాలీన తెలుగు జీవితాన్ని పై పైనా తడుముతున్నాయే కానీ నిశితం గా పరిశీలించటం లేదనే’’ ఒక అసంతృప్తి కూడా ఈ కథలకు ప్రేరణ. ‘‘తెలుగు కథలలోని మూస కి లొంగకుండా కథ రాయాలనే కోరిక’’, కూడా నేను ఈ కథలు రాయటాని ఓ కారణం. ఈ నా ప్రయత్నం లో ఎంతవరకూ సఫలమయానో పాఠకులే నిర్ణయించాలి.

బొందలపాటి

http://bondalapati.wordpress.com

ఈ సంపుటి లోని కథలు...

ఆధుని’కులం’

అదృశ్యమైన అంకినీడు

శృతి ఆకలి

ఆల్ ఇన్ వన్ రచయిత

హారర్

ఆనందాన్వేషణ

ఆధుని'కులం': ''చాలా మంచి కథ. కథ పెద్దదై నప్పటికీ ఆపకుండా చదివించారు. నాకు ముగింపు చాలా బాగా నచ్చింది''.

''చాలా,చాలా బాగుంది. ఇంత గొప్ప కథని ఈ మధ్య నేనెక్కడా చదవలేదు.ఎప్పుడో పెట్టిన పోస్టుని ఇప్పటికైనా చూసి చదవగలగడం నాఅదృష్టం. మీ మిగిలిన పోస్టులన్నీ చదువుతాను''.

అదృశ్యమైన అంకినీడు: ''చాలా బాగుంది. కథ అంటే మనుషుల బ్రతుకుని అద్దం పట్టేదంటారు. ఆ వాసనలు ఈ కథలో అచ్చంగా కనిపించాయి.ఒక మనిషి జీవితాన్ని ఎదురుగా కళ్ళకు కట్టినట్టు చూపించారు''.

శృతి ఆకలి : ''హ్మ్ .... తరువాత చెప్తాను సస్పెన్స్''.

ఆల్ ఇన్ వన్ రచయిత : "brilliant!"

హారర్ : ''హారర్ కథ ఇలా కూడా రాయవచ్చా..?!''

ఆనందాన్వేషణ: ''చివుకుల పురుషోత్తం గారి కథలెప్పుడైనా చదివారా?!''

# ఆధుని'కులం'

ఉదయం ఎనిమిది గంటలు.చెన్నై సెంట్రల్ స్టేషన్ లో ఉన్న పెద్ద టీవీ తెర ముందు కూర్చొని, తీరికగా ఒక ఇంగ్లీష్ నవల పేజీలు తిప్పుతున్నాడు హారీ. పక్క సీట్ లో ఉన్నతన లాప్ టాప్ బ్యాగ్ వైపు అప్పుడప్పుడూ చూస్తున్నాడు.

"ఇండియా లో దొంగతనాలెక్కువ. జాగ్రత్త గా ఉండాలి", అని చెప్పాడు హారీ అనబడే హరికృష్ణ కి, వాళ్ళ 'డాడ్ అనబడే నాన్న'. ఆయన అమెరికా లోని కాలిఫోర్నియా లో ఉంటాడు.

"ఎక్స్ క్యూజ్ మీ..కెన్ ఐ సిట్ హియర్?", ఎవరో అంటే తలెత్తి చూశాడు హారీ. ఓ వ్యక్తి పక్క సీట్లో ఉన్న హారీ లాప్ టాప్ వైపు చెయ్యి చూపిస్తూ అడుగుతున్నాడు.

"హౌ కెన్ ఐ టెల్ ఇఫ్ యు కెన్ సిట్ ఆర్ నాట్..ఇఫ్ యువర్ బాక్ ఈజ్ నాట్ స్ప్రైయిండ్ యు షుడ్ బి ఏబుల్ టు సిట్" అని పెద్దగా నవ్వేశాడు హారీ.

తన లాప్ టాప్ తీసుకొని ఒళ్ళో పెట్టుకొని పక్క సీట్ వైపుకి చేత్తో చూపిస్తూ, "అయాం కిడ్డింగ్...ప్లీజ్ సిట్" అన్నాడు ఆ మనిషి తో. "ఇండియన్ ఇంగ్లీష్ ఈజ్ ఫన్నీ యు నో. సం టైంస్ వి అమెరికన్స్ గెట్ ఇట్ రాంగ్" అన్నాడు అమెరికన్ ఆక్సెంట్ లో.

"మీరు అమెరికనా?" ఇంగ్లీష్ లో అన్నాడా వచ్చిన వ్యక్తి, పక్క సీట్లో కూర్చొంటూ.

"మా నాన్న డెబ్భై ల లో అమెరికా లో సెటిల్ అయాడు. నేను అక్కడే పుట్టి పెరిగాను. కాబట్టీ నేను ఖచ్చితం గా అమెరికన్ నే", అన్నాడు హారీ ఒకింత గర్వం గా . .

సంభాషణ ఇంగ్లీష్ లోనే కొనసాగుతోంది..

"నా పేరు సుబ్బారావు", అని చేయి చాపాడు వచ్చినతను.

"హారీ ...హరికృష్ణ.." అని చెయ్యి కలిపాడు హారీ.

"మీరు ఎక్కడికి వెళ్తున్నారు?"

"హైదరాబాద్".

“ఓ..! నేనూ అక్కడికే..నేను విజయవాడ వరకూ నవజీవన్ లో వెళ్ళి అక్కడి నుంచీ కోణార్క్ పట్టుకుంటాను..మరి మీరు?” అడిగాడు సుబ్బారావు

“నేనూ అంతే “

“పగలు ప్రయాణం పెట్టుకున్నారేమిటి సార్?అయినా మీరు ట్రైన్ లో వస్తున్నారేంటండీ..ఫ్లైట్ టిక్కెట్లుదొరకలేదా?”

హారీ, “వీడికెందుకు, నోసీ ఇండియన్”, అని మనసులో అనుకొని, ఇలా అన్నాడు, “హైదరాబాద్ నుంచీ వచ్చేటప్పుడు ప్లేన్ లోనే వచ్చాను. ఇక్కడి అమెరికన్ కాన్సులేట్లో పని ఉండి వచ్చాను. కానీ ఇప్పుడు ట్రైన్ లో వెళ్తున్నాను. దీనికి ఓ కారణం ఉంది. నేను ఒక ‘ఇండో అమెరికన్ స్టూడెంట్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం’ లో రీసెర్చ్ చేయటానికి అమెరికా నుంచీ హైదరాబాద్ వచ్చాను. ‘ద సోషల్ గ్రూప్స్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్’ అనే విషయం మీద పరిశోధన చేస్తున్నాను. మా నాన్న చెప్పాడు, “ఆంధ్ర లో ఉండే వివిధ వర్గాల ప్రజల గురించి కొంచెం ప్రాక్టికల్ గా తెలుసు కోవాలంటే ఓ సారి సెకండ్ క్లాస్ లో ట్రెయిన్ ప్రయాణం చెయ్యి” అని. దీనికి పగలు ప్రయాణం అయితేనే మెరుగు...కాస్త జనాలతో మాట్లాడవచ్చు.. అందుకే ఇప్పుడు ఇక్కడ ఉన్నాను.”

“మీరు జెనరల్ క్లాస్ లో వెళ్తే మీకు జనాల గురించి ఇంకా విపులం గా అర్ధమౌతుంది..కానీ మీరు జెనరల్ లో ప్రయాణం చెయ్యలేరులెండి....ఇంతకీ.. మీకు తెలుగు వచ్చా?”

“తెల్గూ అర్ధమౌతుంది.కొంచెం నెమ్మది గా మాట్లాడ గలుగుతాను”,

“కానీ మీరు ఇక్కడి సామాన్య జనాలతో మాట్లాడటం చాలా కష్టం కదా...!మీ అమెరికన్ ఆక్సెంటూ..మీ తెలుగూ వాళ్ళకి అర్ధం కాదు”,సందేహం వెలిబుచ్చాడు సుబ్బారావు.

“చెన్నై లో ఉండే తెలుగు ఫ్రెండ్ ఒకతను నా కూడా వస్తానన్నాడు.చివరి నిమిషం లో ఫోన్ చేసి రానని చెప్పాడు”, అని వాటర్ బాటిల్ ఎత్తి నీళ్ళు తాగి,”మీరేం చేస్తారు?” అన్నాడు హారీ.

“నేను గ్రాడ్యుయేట్ అయ్యింది కామర్స్ లో. ఓ ప్రైవేట్ బాంక్ లో మానేజర్ గా పని చేశాను..దాదాపు ఆంధ్రా అంతా తిరిగాను.. ఓ సంవత్సరం కిందట రిజైన్ చేసి హైదరాబాద్ లో సొంత వ్యాపారం ఒకటి పెట్టాను”, అని, “అవునూ మీరు ఆంధ్రా లోని జాతుల గురించి అధ్యయనం చేస్తున్నారు కదా, మీ కులమేదో మీకు తెలుసా?”

“వీడేంటబ్బా..! ఇవ్వక పోయినా చనువు తీసేసుకొంటున్నాడు!”, అని మనసు లోనే అనుకొని, “నా మాతృభాష తెలుగు అని తెలుసు...ఇండియా లో కులాలు అని ఉంటాయి అని తెలుసు...కొన్ని పై కులాలు..కొన్ని కింది కులాలు...కానీ నా కులం నాకు తెలీదు...బహుశా మా డాడ్ కి తెలిసి ఉంటుంది. ఈ సారి నాన్న తో చాట్ చేసినప్పుడు అడగాలి” అన్నాడు. ఒక్క క్షణమాగి, “మీ కులమేమిటి?” అనడిగాడు.

“నాకూ నా కులం తెలియదు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ హైదరబాదు లోని ఓ అనాథాశ్రమం లోపెరిగాను. వార్డెన్ నా పేరు సుబ్బారావు అని పెట్టాడు. అది కామన్ గా ఉండే పేరు కదా? నేను నల్లగా ఉన్నాను కాబట్టీ నా ఇంటి పేరు నల్లతోలు అని రిజిస్టర్ లో రాశాడు. సో, నా పేరు నల్ల తోలు సుబ్బారావు అయ్యింది”

హారీ, “ఏమి కథలు చెప్తున్నాడు..!” అనుకొని..”ఏమైనా ఇండియన్స్ తో జాగ్రత్త గా ఉండాలి..డాడ్ చెప్పనే చెప్పాడు”, అనుకొన్నాడు.

“ మీకు ఇండియా ఎలా అనిపిస్తోంది సార్ ?”

“ఇండియా నాకు కొత్తేమీ కాదు. మా డాడ్ తో పాటు వస్తూ ఉండే వాడిని..కానీ ఈ రైల్వే స్టేషన్ లో ఈ జనాలను చూసిన తరువాత ఈ ప్రయాణం ఎలా చేయగలనా అనిపిస్తోంది. దానితో పాటు జనాల తో మాట్లాడాలి..నా ఫ్రెండేమో రాలేదు.”

“మీ రీసెర్చ్ కోసం దానికి సంబనిధించిన పుస్తకాలు చదువుకుంటే సరిపోతుంది కదా? మీరు ఈ ట్రెయిన్ ప్రయాణం ఎందుకు మొదలుపెట్టారో నాకు ఇంకా అర్ధం కావటం లేదు”

“పుస్తకాలు ఒక విషయం గురించి లాంగ్ వ్యూ ని ఇస్తాయి. అడవి లో ఉన్న ఒక కొండ ఎక్కి కిందకి చుట్టూ చూశామనుకోండి, దూరం గా పచ్చటి చెట్లు గుబురు గా కనపడతాయి. కానీ ఆ చెట్లకింద ఏమి ఉందో కనపడదు. ఏ చెట్టు ది ఏ కాయో తెలియదు. ఇదంతా తెలియాలంటే అడవి లోకి వెళ్ళి చెట్ల కింద చూడాల్సిందే కదా?”

దానికి సుబ్బారావు, “నా బ్రతుకు అంతా ఈ ఆంధ్రప్రదేశ్ అనే అడవి లో చెట్లకిందే గడిచింది. ఏ చెట్టు ఏ జాతిదో, ఏ చెట్టు కింద ఏ మొక్క పెరుగుతుందో ఇట్టే కని పెట్టేస్తాను.ఏ చెట్టు కి ఏ కాయ కాస్తుందో..ఆ కాయ రుచి ఏమిటో కూడా చెట్టుని చూసి కనిపెట్టేస్తాను. మీకు ఏమైనా సందేహాలుంటే నన్నడగండి” అన్నాడు సుబ్బారావు. “వీడేంటబ్బా అందిస్తే అల్లుకు పోయే వాడిలా ఉన్నాడు!”, అని తనలోనే అనుకొని, “చూడండి మిస్టర్ రావ్, నాకు ఈ ఆంధ్రా లో ఉన్న సమాజం అనేది మీరు కాలేజీ లో చదివిన అకౌంటెన్సీ లాంటి ఒక సబ్జెక్ట్ లాంటిది. దీని గురించి నేను

కొండ మీది నుంచీ చూసి నా బుద్ధి మాత్రం ఉపయోగించి తెలుసుకొంటున్నాను. దీనికి నా భావావేశాలతో ఏ మాత్రం సంబంధం లేదు. నా అంచనా ప్రకారం మీ భావావేశాలకూ లంకెలేదు. ఇక్కడి సాంఘిక వ్యవస్థ కి మీరు కూడా ఒక బయటి వ్యక్తే . కానీ మీరు ఇక్కడి పరిణామాలన్నింటినీ దగ్గర గా చూశారు. "నిజమైన వ్యక్తులూ, ఈ సమాజిక వ్యవస్థ లో వారి సాధక బాధకాలూ, ఆవేశ కావేశాలూ. ఈ ఆంధ్ర లో ఒక దళితుడి మనో భావాలేమిటి...ఒక ముస్లిం ఫీలింగ్స్ ఏమిటి...ఒక అగ్ర కులస్థుడి పరిస్థితి ఏమిటి? ఒక తెలంగాణా వాది ఆవేశం ఎందుకు?",... ఇదీ నాకు కావలసినది. మీరు మంచి కలుపు గోలు వ్యక్తి లా ఉన్నారు. ఈ ప్రయాణం లో మీరు నాకు మామూలు జనాలతో ఒక యాంకర్ లా పనిచేస్తారా? దానికి మీకు కొంత డబ్బు కూడా ఇస్తాను" హారీ మైండ్ కి రైల్లో జనాలతో మాట్లాడటానికి ఇంతకంటే మంచి తోవ కనపడలా.

"సరే", అనేశాడు సుబ్బారావు."మీ సీట్ నంబర్ ఎంత సార్?" అని హారీ దగ్గరినుంచీ టికెట్ తీసుకొని చూసి,"ఓ కే సార్ టీ సీకి చెప్పి, నా సీట్ కూడా మీ సీట్ దగ్గరికి మార్పించుకొంటాను", అన్నాడు సుబ్బారావు.

ఈ లోగా వాళ్ళ ట్రైన్ బయలుదేరుతున్నట్లు అనౌన్స్ అయ్యింది. ఇద్దరూ లేచి ట్రైన్ వైపు నడక సాగించారు.

**********

తమిళుడి లాగా అడ్డపంచె చుట్టి , ఓ చేతి లో సిగరెట్ పట్టి, ఇంకో చేతిలో క్యాష్ బాగ్ తో ప్లాట్ ఫారం మీదికొచ్చాడు మాగుంట దయాకర రెడ్డి. జుట్టు అక్కడక్కడా తెల్లబడింది. ఆయనకో నలభై ఐదు ఏళ్ళు ఉండవచ్చు. తొంభయ్యవ దశకం మొదట్లో రొయ్యల చెరువులేసి బాగానే సంపాదించాడు. మెడలో బంగారు గొలుసూ చేతిలో నాలుగు వేళ్ళకీ ఉంగరాలు.

ప్లాట్ ఫాం మీద నాటు గా ఉన్న ఓ పల్లెటూరి పడుచు కనపడింది. ఆమె ను చూస్తే కావలి లో ఉన్న తన కీప్ గుర్తుకొచ్చింది దయాకర్ రెడ్డి కి. "దీని గుడ్డలూడ దీస్తే బ్రమ్మాండం గా ఉంటది", అనుకొన్నాడు మనసులో. ఆయన రిజర్వేషన్ చేయించుకోలేదు కానీ, "టీ సీ కి ఓ యాభయ్యో వందో కొడితే ఫైను రాసేస్తాడుగదా.. . దానికేమీ భయపడ బళ్ళా" అనుకొని కదులుతూ ఉన్నసెకండ్ క్లాస్ భోగీ లోకి ఎక్కాడు. హారీ, సుబ్బారావూ అక్కడ కూర్చొని ఉన్నారు. దయాకర రెడ్డి సిగరెట్ బయటికి విసిరేసి బాగ్ లోంచీ ఆ రోజు సాక్షి పేపర్ తీశాడు.

సుబ్బారావు ఆయన్ని చూసి, "ఎక్కడికెళ్తున్నారు సార్?" అన్నాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1011**

* * *

**Read other books of Bondalapati @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=130**